క్లుప్తంగా

సహనానికి ప్రతీక రంజాన్



గన్నవరంరూరల్: సహనానికి ప్రతీక రంజాన్ అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య అన్నారు. సూరంపల్లి గ్రామంలోని 50 ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆయన తోఫా(సరుకులు) పంపిణీ చేశారు. స్థానిక మసీదులో ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ కందిమళ్ల శ్రీనివాసరావు, యూత్ విభాగం కన్వీనర్ ప్రత్తిపాటి రాజా, సహకార బ్యాంకు చైర్‌పర్సన్ తుల్లిమిల్లి ఏడుకొండలు, వార్డు సభ్యుడు కందిమళ్ల రాఘవ, మండల వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ పామర్తి మాధవరావు, నాయకులు భూక్యా కోటేశ్వరరావు, పులపాక శామ్యూల్, గుడ్డేటి అనిల్, కిరణ్, తోట నవీన్, మాజీ ఉపసర్పంచ్ తోట సాంబశివరావు, రాయల జగదీష్ పాల్గొన్నారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ



రామవరప్పాడు: శ్రీ వాసవీ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రసాదంపాడు మహీంద్ర షోరూమ్ సమీపంలో బాటసారులు, ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూలూరు వాసవి, సంఘం జాయింట్ సెక్రటరీ సాయికృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

బాబూరావు మృతికి ఎంపీపీ నివాళి

గన్నవరంరూరల్: మండలంలోని మాదలవారిగూడెం గ్రామ శివారు చనుపల్లివారిగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గజగంటి బాబూరావు(63) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఎంపీపీ అనగాని రవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, పలువురు మండల, గ్రామ నాయకులు మంగళవారం బాబూరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం గ్రామ పరిధిలోని పామర్తినగర్‌లో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ టిఫిన్ సెంటర్ దగ్ధమైంది. అగ్నిమాపక శాఖ సమాచారం ప్రకారం...రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన శ్రీనివాసరావు పామర్తినగర్‌లో లక్ష్మీ టిఫిన్ సెంటర్‌ను నడుపుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం మూసివున్న టిఫిన్ సెంటర్‌లో విద్యుత్ వైరు షార్ట్ సర్క్యూట్‌కు గురై మంటలు చెలరేగాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షలు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే ఇళ్ల మధ్య ఉన్న ఈ టిఫిన్ సెంటర్‌లో ఉన్న గ్యాస్ సిలిండర్లు పేలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

నున్న మసీదులో ఇఫ్తార్ విందు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో చెరువు సెంటర్లోని మసీదులో మంగళవారం ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, నాయకులు కాటూరి శ్రీనివాసరావు, బొంతు సాంబిరెడ్డి, షేక్ హుస్సేన్, మసీదు గురువు సాజిత్ పాల్గొన్నారు.

సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా కళ్లం

గన్నవరం: ఇండియా కూటమిలోని సీపీఎంకు గన్నవరం అసెంబ్లీ సీటు దక్కింది. ఆ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా సీనియర్ నేత కళ్లం వెంకటేశ్వరరావును ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలి

గన్నవరం: పజా సంక్షేమ పాలన కొనసాగింపు కోసం ప్రతిఒక్కరూ వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. మండలంలోని కేసరపల్లి శివారు వీఎన్ పురం కాలనీలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌కు మద్దతుగా సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక నేతృత్వంలో ఆ పార్టీ నేతలు గడప గడపకు ప్రచారం నిర్వహించారు. పార్టీ ఎన్నికల సమన్వయకర్త రామిశెట్టి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మేచినేని బాబు ప్రజలను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఎన్ పురం కాలనీ అభివృద్ధి చేసిన ఘనత వంశీమోహన్‌కు దక్కుతుందన్నారు.

మోసగాళ్ల మాటలు నమ్మొద్దు..నేను మీ వాణ్ణి

రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్



వ్యాపారులను కలిసి మద్దతు కోరుతున్న మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: ''నేను మీ బిడ్డను...మీకెప్పుడూ తోడుగా ఉంటా...అండగా నిలుస్తా...నేను మీవాణ్ణి..జగనన్న సైనికుణ్ణి.. మీ కోసం పనిచేస్తా...మోసగాళ్ల మాటలు నమ్మొద్దు..మోసపోవద్దు...'' అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలో మంగళవారం వేకువజామునే మంత్రి జోగి రమేష్ విస్తృతంగా పర్యటించారు. మార్నింగ్ వాకర్స్‌తో కలిసి సిద్ధార్థ కళాశాల మైదానంలో ఉదయపు నడకలో పాల్గొన్నారు. అనంతరం వాకర్స్‌తో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని శివాలయం రోడ్డు, మెయిన్‌రోడ్డుల్లో చిరు వ్యాపారులు, దుకాణదారులను కలుసుకున్నారు. చిరు వ్యాపారుల కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. టీ స్టాల్‌లో స్వయంగా టీ కాచి పార్టీ శ్రేణులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ నిస్వార్థ ప్రజాసేవకుడిగా పెనమలూరు నియోజకవర్గ ప్రజలకు సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. పెనమలూరు నియోజకవర్గంలో తనకు ప్రజల నుంచి లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక తనపై అక్కసుతో టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మాయమాటలతో ప్రజలను గందరగోళానికి గురిచేసి రాజకీయంగా లబ్ధి పొందేందుకు కుట్ర పూరితంగా వ్యవహరిస్తుండటం సిగ్గుచేటన్నారు. తాను అన్ని వర్గాలకూ అండగా ఉంటానన్నారు. సీఎం జగనన్న సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడతానన్నారు. పేదల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తినని, తనను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అఖండ విజయాన్ని అందించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మున్సిపల్ వైస్‌చైర్మన్ సోలే సురేష్‌బాబు, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, కౌన్సిలర్లు డాక్టర్ జంపాన పూర్ణిమ, గోన మదన్, బేగ్, నాయకులు ఊర కిషోర్, అబ్దుల్ సద్దాం, షేక్ ఖలీల్, గడ్డం చైతన్య, సీహెచ్ కుటుంబరాజు, దాసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ఓటడిగే హక్కు జగనన్నకే ఉంది

పెనమలూరు: రాష్ట్ర ప్రజలను ఓటు అడిగే హక్కు కేవలం జగనన్నకే ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. గోసాల, వణుకూరు గ్రామాల్లో మంగళవారం పార్టీ నేతలు, ముఖ్య కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించి, అనంతరం గోసాలలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో పాదయాత్ర చేసిన జగనన్న ప్రజలకు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారన్నారు. అర్హత ఉన్న ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు మాట తప్పకుండా జగనన్న నెరవేర్చారని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించి, ప్రజల మద్దతు కోరి జగనన్నకే ఓటు వేయాలని కోరాలన్నారు. పెనమలూరులో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలన్నారు.

చంద్రబాబును నమ్మితే మోసపోవటమే...

చంద్రబాబునాయుడిని నమ్మితే ప్రజలతో పాటు నాయకులు కూడా మోసపోతారన్నారు. కాల్‌మనీ, సెక్స్ రాకెట్ ఉందని బోడె ప్రసాద్‌ను పక్కన పెట్టి , కుటుంబాన్ని రోడ్డుకు ఈడ్చి కంట తడి పెట్టించి చివరకు సీటు ఇచ్చాడన్నారు. 2014లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, బీజేపీ ప్రజలను మోసం చేసి గెలిచారని, ఆ తరువాత ఒకరిని ఒకరు కుటుంబ సభ్యులతో సహా తిట్టుకుని మళ్లీ ఇప్పుడు ముగ్గురూ కలిసిపోవటం ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, గోసాల సర్పంచి సంగెపు శ్రీనివాసరావు, పోలవరపు రవి, వడుగు సర్వేశ్వరరావు, షేక్ పీర్ అహ్మద్, ఎండీ దాదా, సింగవరపు విజయ, గోపాలకృష్ణ, తాటి వసంతలక్ష్మి, కొండా కనకలక్ష్మి, ఝాన్సీ, చోడవరపు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. వణుకూరులో జరిగిన సమావేశంలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ పార్టీ విజయానికి అందరూ సమన్వయంతో పని చేసి గ్రామంలో మెజార్టీ తీసుకురావాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు చక్కా గోపి, డి.కిషోర్, పంచాయతీ మెంబర్లు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలి



ప్రసంగిస్తున్న జోగి రాజీవ్

కంకిపాడు: సంక్షేమ ఫలాలు అందరికీ అందాలంటే తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. మండలంలోని గొల్లగూడెం గ్రామంలో మంగళవారం రాజీవ్ పర్యటించారు. మహిళలను, యువతను కలుసుకుని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పాలన అందించటం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీకి, ముఖ్యమంత్రి జగనన్నకు బాసటగా నిలవాలని కోరారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ యువత రాజీవ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, ఎస్సీ నేత శీలం శ్రీరాములు, ఏఎంసీ డైరెక్టర్ మరియబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది వేడుకల్లో పాల్గొన్న మంత్రి జోగి రమేష్



ఉయ్యూరు శివాలయంలో సోమేశ్వర స్వామిని పూజిస్తున్న మంత్రి జోగి రమేష్



అమ్మవారిని దర్శించుకుంటున్న ఏసీపీ భాస్కర్

ఉయ్యూరు: ఉయ్యూరులో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. శివాలయం, విష్ణాలయం, ప్రముఖ ఆలయాల్లో వేదపండితులు మంగళవారం పంచాంగ శ్రవణం చేశారు. భక్తులు వేకువజామునే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకున్నారు. తెలుగు సంవత్సరాదికి ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ఉయ్యూరు శివాలయంలో సోమేశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కుటుంబరాజు, పాలకవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉయ్యూరు ఏజీఅండ్‌ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో ఉగాది వేడుకలు నిర్వహించారు.

పలు గ్రామాల్లో ఉగాది వేడుకలు

రామవరప్పాడు: క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏసీపీ భాస్కర్, దేవదాయ ఉప కమిషనర్ రతన్‌రాజు పేరంటాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది వీరిని ఆహ్వానించి అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో ఘనంగా ఉగాది వేడుకలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో తెలుగు సంవత్సరాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.ఆలయ ప్రాంగణంలోని ఆధ్యాత్మిక వేదికపై అర్చకుడు శృంగారం రామానుజాచార్యులు క్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణం చేశారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దాతలు బొరుసువెదుళ్ల మెహర్‌కుమార్, లక్ష్మీ రామలీల శిరీష దంపతులు (హైదరాబాద్) సహకారంతో 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈఓ కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యనమలకుదురులో పంచాంగ శ్రవణం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో తెలుగు ప్రజల నూతన సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకం చేశారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ పార్వతీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. క్రోధినామ సంవత్సరం సందర్భంగా ఆలయంలో పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు, ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్, ఈవో ఎం.గంగాధరరావు, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఘన విజయమే లక్ష్యం

గన్నవరంరూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని ఎంపీపీ అనగాని రవి సూచించారు. తెంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన వైఎస్సార్ సీపీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ప్రతిపక్షాల కుట్రలను కార్యకర్తలు తిప్పి కొట్టాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని విస్తృత ప్రచారం చేయాలన్నారు. మరింత సంక్షేమం గడపగడపకు చేరాలంటే వైఎస్సార్‌సీపీకి అందరూ అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రామిశెట్టి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సమావేశంలో సర్పంచ్ కొలుసు శిరీష, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు వీర్ల సామేలు, పడమట సురేష్, కొలుసు కిరణ్‌కుమార్, సూరెడ్డి మణిమ్మ, నాగనబోయిన గిరీష్‌రాజ్, పులపాక రాజారత్నం, కొలుసు చిట్టిబాబు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

'ఎన్డీఏ నిజస్వరూపం బట్టబయలు చేసిన పురందేశ్వరి'

పెనమలూరు: ముస్లిం రిజర్వేషన్లపై ఎన్డీఏ నిజస్వరూపాన్ని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి బట్టబయలు చేశారని పెనమలూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వెలశిల సుబ్రహ్మణ్యం విమర్శించారు. ఆయన మంగళవారం కానూరులో విలేకరులకు వివరాలు తెలుపుతూ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని పురందేశ్వరి చేసిన ప్రకటన దారుణమన్నారు. ఆమె ప్రకటనను టీడీపీ, జనసేన ఖండించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీలకు అండగా ఉంటుదన్నారు.

నూర్‌బాషా సంక్షేమ సంఘ గౌరవాధ్యక్షురాలిగా షేక్ మాబి

పెనమలూరు: ఏపీ నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలిగా యనమలకుదురు గ్రామానికి చెందిన షేక్ మాబీని నియమించారు. నూర్‌బాషా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా మంగళవారం ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా అధ్యక్షురాలు షేక్ రంజాన్‌బి, సభ్యులు షేక్ అమీనాబి, షేక్ హసీనాబి తదితరులు మాబిని ఘనంగా సన్మానించారు.

చినకంచిలో వసంత నవరాత్రి ఉత్సవాలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చినకంచిలో మంగళవారం వసంత నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉగాది పర్వదినం నుంచి శ్రీరామనవమి వరకు 9 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని దేవస్థానం ట్రస్టీ ముక్కపాటి శర్మ తెలియచేశారు. ఈ తొమ్మిది రోజులపాటు శ్రీకామాక్షి అమ్మవారికి 12వేల మల్లెపువ్వులతో 12వేల నామాలను చదువుతూ అర్చన జరుగుతుందన్నారు. మొత్తం తొమ్మిది రోజుల్లో లక్ష మల్లెలతో అర్చన జరుగుతుందన్నారు. అనంతరం చంద్రశేఖరేంద్రసరస్వతి స్వామి దేవాలయంలో శ్రీ క్రోధి నామ సంవత్సరం పంచాంగ శ్రవణం ఫలితాలను వేదపండితులు పవనకుమార శర్మ చదివి వినిపించారు. గ్రామంలోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు తూర్పు రామాలయం, పడమర రామాలయం, సాయిబాబా గుడి, బోడపాడు గ్రామంలోని శ్రీకోదండ రామాలయం, విలేజి కండ్రిక రామాలయం, పాతపాడు చెన్నకేశవస్వామి దేవస్థానం, వెంకటాపురం రామాలయం, పి.నైనవరం రామాలయాల్లో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

మరోసారి మోసం చేసేందుకే జత కట్టారు



మాట్లాడుతున్న నూరుద్దీన్

రామవరప్పాడు: టీడీపీ, జనసేన బీజేపీలు రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకే జత కట్టారని, ఎంత మంది కలిసొచ్చినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడాన్ని అడ్డుకోలేరని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి సయ్యద్ నూరుద్దీన్ అన్నారు. రామవరప్పాడులోని మైనార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూరుద్దీన్ మాట్లాడుతూ 2019లో నరేంద్రమోదీని తిట్టిన చంద్రబాబు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని పొత్తు పెట్టుకున్నాడని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి 4 శాతం ముస్లింల రిజర్వేషన్ ఎత్తి వేస్తామని ప్రకటన చేస్తోందని, అలాంటి బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన పార్టీలను తరిమికొట్టేందుకు ముస్లింలు సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి పొత్తు పార్టీల మోసాలను బట్టబయలు చేస్తానన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా రాష్ట్ర ప్రజలు జగన్‌ను రెండవసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటారన్నారు.

సేవాగుణంతో సమాజంలో గుర్తింపు



పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న సీడీసీ చైర్మన్ రాజులపాటి, లయన్స్ ప్రతినిధులు

ఉయ్యూరు: సేవాగుణంతో సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో ఉయ్యూరు శివాలయంలో మంగళవారం పేదలకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పేదలు, పురోహితులకు లయన్స్ క్లబ్ జిల్లా కేబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావుతో కలిసి సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు నిత్యావసరాలు అందజేశారు. క్లబ్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను రాజులపాటి అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, శివాలయం చైర్మన్ సీహెచ్ కుటుంబరాజు, ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, ఊర కిషోర్‌కుమార్, వీణవాహి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవితానికి నడక మంచి ఔషధం



నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జిల్లా గవర్నర్

గన్నవరం: ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతిఒక్కరూ వాకింగ్ చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ జిల్లా గవర్నర్ చిన్నం రామకృష్ణ సూచించారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం వాకర్స్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నూతన అధ్యక్షులు కేవీఆర్ కిషోర్, కార్యదర్శి ఎల్. సురేంద్ర, కోశాధికారి బి. కోటేశ్వరరావుతో జిల్లా గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ ఎండీ గౌసాని, గ్రామ సర్పంచి నిడమర్తి సౌజన్య, హెచ్‌ఎం ఎన్.రవీంద్రభవాని, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ దుట్టాను కలిసిన ఏలూరు ఎంపీ, దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థులు



డాక్టర్ దుట్టాతో ఏలూరు ఎంపీ, దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్‌కుమార్, అబ్బయ్య చౌదరి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరు సునీల్‌కుమార్, దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్య చౌదరి ఆ పార్టీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావును హనుమాన్‌జంక్షన్‌లోని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు ఎంపీ, దెందులూరు ఎమ్మెల్యే స్థానాల్లో కారుమూరు సునీల్‌కుమార్, కొఠారు అబ్బయ్య చౌదరి గెలుపొందటం ఖాయమని డాక్టర్ దుట్టా ఆశీస్సులు అందించారు. వీరి వెంట ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, పార్టీ నాయకులు ఘంటా ప్రసాద్, అన్నం సత్యనారాయణ, దుట్టా రాంబాబు, అల్లంశెట్టి వెంకటేశ్వరరావు ఉన్నారు.

కోడి పందేల నిర్వాహకులు అరెస్ట్

ఉంగుటూరు: కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను ఆత్కూరు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొట్టిపాడు గ్రామ శివారులో పామాయిల్ తోటలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ పైడిబాబు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు స్వాధీనపరచుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

దళితులకు గుర్తింపు ఇచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

గన్నవరం: దళితులకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ప్రాధాన్యం ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు సరిహద్దు ఆంతోని అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన దేవరపల్లి వెంకటేశ్వరరావును మంగళవారం మాల మహానాడు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆంతోని మాట్లాడుతూ నియోజకవర్గంలోని దళితులకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ అన్ని రకాలుగా అండగా నిలిచారని, తన సొంత ఖర్చుతో విద్య, వైద్యం, ఉపాధి పరంగా వేలాది మందికి తోడ్పాటునందించారని తెలిపారు. దళిత సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దేవరపల్లి బుజ్జిబాబు, మాల మహానాడు సంఘ నేతలు పొణుకుమాటి ఉదయభాస్కర్, మారుపూడి రాంబాబు, తిరివీధి సుధీర్, రాపల్లి విల్సన్, దేవరపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనకు అడుగడుగునా నీరాజనాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బొమ్ములూరులో జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, పీఏసీఎస్ మాజీ చైర్మన్ యర్రంశెట్టి రామాంజనేయులు నేతృత్వంలోనూ, హనుమాన్‌నగర్‌లో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, పార్టీ బీసీ నాయకుడు చెన్నుబోయిన శివయ్య, క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌మూర్తి నేతృత్వంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొత్తపల్లిలో చెరుకూరి శ్రీనివాస్, రంగయ్య అప్పారావు పేటలో ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పార్టీ నాయకులు నన్నపనేని చలపతిరావు, కాకొల్లు శేఖర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, గన్నవరం ఎమ్మెల్యేగా వల్లభనేని వంశీని గెలిపించుకునేందుకు ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. వీరవల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు గూడవల్లి రత్నసుధాకర్, కోడెబోయిన బాబి, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పోరంకిలో చలివేంద్రం ప్రారంభం

పెనమలూరు: పోరంకి గ్రామంలో మంగళవారం చలివేంద్రాన్ని మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకురాలు బొర్రా కనకదుర్గ ప్రారంభించారు. కార్యక్రమంలో బీసీ నేతలు బొర్రా కృష్ణ, కుందేటి శివరామకృష్ణ, బొర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపు కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి ప్రభునగర్‌కు చెందిన గున్నుపాముల కావ్య గత ఏడాది సత్యకృష్ణను పెద్దల సమక్షంలో కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. భర్త హైదరాబాద్ జీడిమెట్లలో ప్రైవేటు ఉద్యోగం చేస్తాడు. అయితే కొద్ది నెలలుగా సత్యకృష్ణ అదనపు కట్నం కావాలంటూ భార్యను వేధించసాగాడు. భర్తతో పాటు అత్త రత్నకుమారి, ఆడపడుచులు వెంకటలక్ష్మి, కామాక్షి కూడా వేధించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు అత్తింటివారికి కౌన్సెలింగ్ చేసినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్టు

కంకిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపు నిర్వాహకుడిని కంకిపాడు పోలీసులు సోమవారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల మేరకు...కోలవెన్ను గ్రామంలో దుర్గారావు అనే వ్యక్తి బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందటంతో నిఘా వేసి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 11 మద్యం సీసాలు లభ్యమయ్యాయి. మద్యం సీసాలను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదనపు ఎస్ఐ తాతాచార్యులు నేతృత్వంలో దాడులు జరిగాయని ఎస్ఐ సందీప్ తెలియజేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ఉంగుటూరు: షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన వెన్నూతల గ్రామంలో మంగళవారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం తోట మాధవరావు తన కుటుంబ సభ్యులతో కలసి ఇంటిలో ఉండగా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో సర్వీస్ వైర్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లో వారంతా బయటకు పరుగులు తీశారు. ఫైర్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను నివారించారు. పూరిల్లు పూర్తిగా దగ్ధం కాగా బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. సుమారు రూ.5 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోతున్నారు. గ్రామ సర్పంచ్ టీవీ రామ్మోహన్‌రావు బాధితులను పరామర్శించారు.